క్లుప్తంగా

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతులు



మంత్రిని సన్మానిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

సిద్దిపేటజోన్: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జి.వివేక్ వెంకట్ స్వామిని కలిసి శుక్రవారం పలువురు వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ ప్రగతికి నిధులు మంజూరు చేయించాలని కౌన్సిలర్లు కోరారు. జిల్లా బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు న్యాయం చేయాలని స్కూల్ మాల పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. జిల్లాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు మంత్రిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ

బెజ్జంకి(సిద్దిపేట): బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ మహతిలక్ష్మి సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా యూనిఫారాలు, నోట్, పాఠ్యపుస్తకాలను అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలని కోరారు. హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు శంకరాచారి, శ్రీవిద్య, మంజుల, కనుకలక్ష్మి, జయ తదితరులు పాల్గొన్నారు.

ధాతృత్వం చాటిన యువత



ఆర్థికసాయం అందజేస్తున్న యువత

గజ్వేల్‌రూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యువకుడి కుటుంబానికి గ్రామ యువకులు అండగా నిలిచారు. మండల పరిధిలోని బెజుగామకు చెందిన మల్లెల శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో గ్రామానికి చెందిన యువత గ్రామస్తుల సహకారంతో శుక్రవారం రూ.26,500 నగదును శేఖర్ కుటుంబ సభ్యులకు అందజేసి మనోధైర్యం కల్పించారు. అదే విధంగా మండల పరిధిలోని అక్కారం గ్రామంలో మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు చంద్రయ్య కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ బాల్ చంద్రం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట రాజు, నర్సింహులు, పరశురాములు ఉన్నారు.

సీసీ కెమెరాల అందజేత



సీసీ కెమెరాలు అందిస్తున్న ఇస్తారి

కొముురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ ఉన్నత పాఠశాలకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ డైరెక్టర్ తేలు ఇస్తారి రూ.30 వేల విలువైన సీసీ కెమెరాలను పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ పాఠశాలను మరింత బలోపేతం చేసుకోవడానికి పూర్వవిద్యార్థులు సహాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, స్వామి, మల్లయ్య, సాయిలు, మల్లయ్య, రమేశ్, సుధాకర్, బాలయ్య, నర్సింహులు, సత్తయ్య పాల్గొన్నారు.

అంగడిలో అధిక ధరలు



రశీదు చూపుతున్న మల్లికార్జున్ రెడ్డి

హుస్నాబాద్: అంగడిలో మున్సిపల్ అధికారులు నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన అంగడిని సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అంగడి నిర్వహణలో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. మున్సిపల్‌కు లక్షల రూపాయలు ఆదాయం వస్తున్నాన నీడ, తాగునీటి సౌకర్యం లేదని వాపోయారు. అధిక ధరలపై విచారణ జరిపించి గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు వికాస్ యాదవ్ ఉన్నారు.

విషం.. రసాయనం

- పశుసంపద లేక.. తగ్గుతున్న భూసారం
- సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి
- సూచనలు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు



సేంద్రియ ఎరువు తయారుచేస్తున్న అన్నదాత



కాడెడ్లతో పొలం దున్నుతున్న రైతు

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ రోజురోజుకు అనూహ్య మార్పులు రావడం సహజం. వ్యవసాయ సాగులో కూడా చాలా మార్పులు వచ్చాయి. పలు రకాల పనిముట్లు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక పద్ధతిని వినియోగించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

దుబ్బాకరూరల్: గతంలో ఎద్దులు సాయంతో భూమి దున్నేవారు. సాగునీటికి బావులే ఆధారం. ప్రతి రైతుకు నాలుగు ఎద్దులు, నాలుగు గేదెలు, ఆవులు ఉండేవి. పశువుల పేడను పొలాల్లో చల్లేవారు. చెరువు మట్టిని పొలాల్లో వేసేవారు. గొర్రెల మందను పొలాల్లో దింపితే వాటి పేడ కూడా పంటకు బలం చేకూర్చేది. పంటచేలో గడ్డి పెరగకుండా కలుపు తీసేవారు.

ఇప్పుడు..

ప్రస్తుతం వ్యవసాయం చేయాలంటే భూమిని చదును చేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు రసాయనిక ఎరువులనే వాడుతున్నారు. విత్తనం నాటే ముందు ముందస్తుగా గడ్డి మందను పిచికారీ చేస్తున్నారు. ఇలా ప్రతిదానికి రసాయనిక ఎరువుల వాడడంతో భూసారం దెబ్బతింటుంది. దీంతో దిగుబడి తగ్గుముఖం పట్టింది.

యంత్రాలతో సాగు

పొలం దున్నేటప్పుడు ట్రాక్టర్‌తో దున్ని వరి నాటు యంత్రంతో నాట్లు వేస్తున్నారు. పంట చేతికొచ్చాక హార్వెస్టర్‌తో కోస్తున్నారు. ఆరుతడి పంటలను సైతం యంత్రాలతోనే సాగు చేస్తున్నారు. ఎక్కడ చూసిన ఒక్క పశువు కూడా కనిపించడం లేదు. అలాగే వరి గడ్డిని పంట పొలాల్లోనే తగులబెడుతున్నారు.

అధిక దిగుబడులు వచ్చేవి..



పూర్వం పశువులు ఉండడం వల్ల పంట చేలల్లో వాటి పేడను వాడేవాళ్లం. రసాయనిక మందులు వాడకం చాలా తక్కువగా ఉండేది. దీంతో భూసారం దెబ్బతినేది కాదు. అందువల్ల పంట ఏపుగా పెరిగి దిగుబడి ఎక్కువగా వచ్చేది. ప్రతి యేటా పంటకు ఎలాంటి చీడ పీడలు వచ్చేవి కాదు.

– భద్రయ్య రైతు, దుబ్బాక

సేంద్రియ ఎరువులతో ఎంతో మేలు

రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూసారం దెబ్బతింటుంది. అందువల్లే పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. గతంలో రైతులు ఎక్కువగా పశువుల పేడ, సేంద్రియ ఎరువులు వాడే వాళ్లు. దాని ద్వారానే భూసారం పెరిగేది. మార్కెట్లో దొరుకుతున్న రకరకాల రసాయనిక ఎరువులు వాడడం వల్లనే భూసారం దెబ్బతింటుంది. సేంద్రియ ఎరువులతో భూసారాన్ని కాపాడుకోవచ్చు.

– ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి

దోపిడీలేని సమాజం కోసమే పోరాటం



కోహెడ(హుస్నాబాద్): సమసమాజ స్థాపనే లక్ష్యంగా, దోపిడీలేని సమాజం కోసం సీపీఐ పోరాటం చేస్తోందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ పార్టీ 14వ మండల మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వాల వైఫల్యలను ప్రతి కార్యకర్త ప్రశ్నించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్, సంపన్న వర్గాలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ వారి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని వాపోయారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే నెరవేర్చాలని లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం మండల కార్యదర్శిగా వెల్పుల శ్రీనివాస్‌ను ఎంపికచేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, తాళ్లపల్లి ఎల్లయ్య, పిల్లి రజిత, శంకర్, గోపి, శేఖర్, జనార్దన్, సత్తిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం



గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న అధ్యాపకులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం నుంచి పంపిణీ అయిన పాఠ్యపుస్తకాలను శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన అందుతుందని ప్రిన్సిపాల్ హరి ప్రసాద్ నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రైవేటు కళాశాలల్లో చదువు కోసం లక్షలు ఖర్చులు పెడుతూ అదనపు భారాన్ని నెత్తిన వేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో హిమబిందు, వశిధర్‌రెడ్డి, రాములు, శ్రీలీల, సత్యనారాయణ, అనిత, మహేందర్, పద్మ, తిరుపతి, గీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్



ఎక్సైజ్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి ప్రజా సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తుందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. మిరుదొడ్డిలో ఎక్సైజ్ కార్యాలయ భన నిర్మాణానికి భూమిపూజ, అలాగే అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె లింగేశ్వరాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే బెల్టు షాపులు, లిక్కర్ షాపులను తొలగిస్తామని మేనిఫెస్టోలో పెట్టిన సీఎం రేవంత్ ప్రస్తుతం ఆ ఊసే లేవనెత్తడం లేదన్నారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుండటంతో కుటుంబాలు చిన్నాభిన్నంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బెల్టు షాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అరికట్టడానికి అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ఎక్సైజ్ ఎస్ఐ సరిత, పంజాల శ్రీనివాస్ గౌడ్, సూకూరి లింగం, అంజిరెడ్డి, రవి, సత్యనారాయణ, ఎండీ.అహ్మద్, శ్రీనివాస్, సత్యనారాయణ, నర్సింహులు, దిలీప్, కుమార్, మల్లయ్య, రంజిత్, మారుతి, రవి, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో కేసులు నమోదు కావొద్దు

- సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి
- ఏసీపీ సదానందం



అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

అక్కన్నపేట(హుస్నాబాద్)/కొముురవెల్లి(సిద్దిపేట)/వర్గల్(గజ్వేల్)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థి దశలో ఏదైనా కేసు నమోదైతే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు రావడానికి అవకాశం ఉండదని హుస్నాబాద్ ఏసీపీ సదానందం అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌లో నిర్వహించే విధుల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను తప్పకుండా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరం జరిగితే 1930కు కాల్‌చేసి వివరాలు తెలిపాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎంఈఓ గుగులోతు రంగానాయక్, ఎస్ఐ విజయ్‌భాస్కర్, హెచ్ఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసులు నిర్వహించే విధులు, సీసీ కెమెరాల పనితీరు, పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, రైటర్ విధులు, సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై వివరించారు. ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వర్గల్ మండలం గౌరారం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పోలీసులు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్, ఇతర నూతన చట్టాలపై గజ్వేల్ షీటీమ్ సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, హెచ్ఎం చంద్రారెడ్డి, షీటీమ్ పోలీసులు శ్యామల, లావణ్య, మహేశ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ షేక్ మహబూబ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫిర్యాదులు ఎలా స్వీకరిస్తారు, ఎఫ్ఐఆర్ నమోదు తదితర వివరాలను విద్యార్థులకు తెలిపారు. రోడ్డు నిబంధనలు, రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రామక్కపేట, పోతారం, గంబీర్‌పూర్ గ్రామాలల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ కనకరాజు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 16 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.16వేల జరిమానా, ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో వారం రోజులుగా ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో ట్రాఫిక్ జామ్ నివారణ, రహదారి భద్రత, ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఏదైనా ట్రాఫిక్ సమస్య తలెత్తితే ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 8712667310 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళా సంఘాల ప్రతినిధులకు శిక్షణ

వర్గల్(గజ్వేల్): స్థానిక మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులకు శిక్షణ నిర్వహించారు. సీనియర్ రిసోర్స్ పర్సన్లు ఎలిజబెత్, జయలక్ష్మి కొత్త బైలా ప్రకారం ఎంపికైన గ్రామ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు తాళ్ల రేణుక, మండల సమాఖ్య కార్యదర్శి బిందు, ఏపీఎం ఆనంద్‌కుమార్, సీసీలు సత్యనారాయణ, నర్సింహులు, పద్మలత, సాయిలు, సుభాష్, భాస్కర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘భూ భారతి’తో సమస్యల పరిష్కారం

పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు

కొండపాక(గజ్వేల్): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని పీఏసీఎస్ డైరెక్టరు బూర్గుల సురేందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికేలా భూ భారతి చట్టంలో పలు అంశాలు చేర్చారని చెప్పారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుంటూ భూ సమస్యల గొడవలను దూరం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు లింగారావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, ఆర్ఐ బాలకిషన్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సురేశ్, రెవెన్యూ సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ లావణ్య

ముగిసిన సదస్సులు

హుస్నాబాద్‌రూరల్: పోతారం(ఎస్), గాంధీనగర్ గ్రామాల్లో నిర్వహించిన సదస్సులతో భూ భారతి రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు తహసీల్దార్ లక్ష్మారెడ్డి తెలిపారు. మండలంలో 17 గ్రామాల్లో 1,297 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దారు రుక్మిణిరెడ్డి, ఆర్ఐ రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకులు మారినా ఫలితం లేదు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అభిషేక్ భాను

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: కేరళలోని కోజికోడ్‌లో త్వరలో జరగబోయే ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాలు మారినా విద్యారంగ సమస్యలు తీరడం లేదన్నారు. జాతీయ మహాసభలలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హర్షవర్ధన్, నవదీప్, కృష్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. 1970 నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలకు విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రాహుల్, బాబు, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లానే ధ్యేయం



సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

సిద్దిపేటకమాన్: గంజాయి రహిత జిల్లానే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని లింగారెడ్డిపల్లి, ఎల్లమ్మ ఆలయం ప్రాంతంలోని హోటళ్లు, పాన్‌షాపులు, కిరాణా దుకాణాలు, అనుమానిత ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్స్‌తో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు ఏవరైనా విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాలపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఫీజుల దోపిడీని అరికట్టాలి

హుస్నాబాద్: ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు వివిధ రకాల ఫీజుల పేరిట విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. సమావేశంలో రాజునాయక్, రవీందర్, చరణ్, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

◆ నేడు జిల్లా కోర్టు ఆవరణలో యోగా డే

సిద్దిపేటకమాన్: ఇంటర్నేషనల్ యోగా డేను పురస్కరించుకుని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6.30కు లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు జిల్లా సెషన్స్ జడ్జి వై.జయ ప్రసాద్ తెలిపారు.

◆ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని సీపీఎం అంబేద్కర్‌నగర్ శాఖ కార్యదర్శి కొండం సంజీవ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీ సభ్యులు తమ బంధువులు, తమకు సంబంధించిన వారినే అర్హులుగా గుర్తించి మంజూరు పత్రాలు ఇప్పించారన్నారు. విచారించి న్యాయం చేయాలన్నారు.

◆ డ్రగ్స్ నివారణపై అవగాహన

సిద్దిపేట: మాదకద్రవ్యాల నివారణపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలన్నారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాదక ద్రవ్యాల నివారణ కమిటీ కన్వీనర్ సువర్ణాదేవి, వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్, అధ్యాపకులు శ్వేత, ప్రవంతి, కిషోర్, హరిప్రసాద్, స్వప్న పాల్గొన్నారు.

◆ ఆపదలో అండగా ఆరోగ్య బీమా

దుబ్బాకటౌన్: ఖాతాదారులు ఎస్‌బీఐ ఆరోగ్య బీమాను సద్వినియోగం చేసుకోవాలని రిజినల్ మేనేజర్ మారుతి సూచించారు. చెర్వాపూర్ వార్డుకు చెందిన మద్దుల రంజిత్ కుమార్‌రెడ్డి ఇటీవల ఆరోగ్య బీమాకు దరఖాస్తు చేసుకున్నాడు. తన కూతురు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడంతో ఆరోగ్య బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును శుక్రవారం రంజిత్ కుమార్‌రెడ్డికి అందజేశారు. మేనేజర్ సందీప్ కుమార్, గుణశేఖర్, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళల అభివృద్ధే దేశాభివృద్ధి

సిద్దిపేటకమాన్: మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని అసిస్టెంట్ ప్రొఫెసర్ వినయకళ అన్నారు. సోషల్ వెల్ఫేర్ డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో అడ్మిషన్‌ల ప్రక్రియపై స్థానిక లింగారెడ్డిపల్లి, రేణుకానగర్, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో కళాశాల సిబ్బంది, బాలికలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

◆ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ప్రభుత్వ యునానీ డాక్టర్ నసీం మున్నిసా అన్నారు. అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని శుక్రవారం ఇంటింట తిరుగుతూ యోగాపై అవగాహన కల్పించారు. శనివారం మిరుదొడ్డిలో యోగాసనాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ సమీనా సుల్తానా, యోగా ట్రైనర్ స్వప్న, ఫార్మసిస్టు నరేశ్, యాదమ్మ పాల్గొన్నారు.

◆ ఏటీసీ మంజూరుతో సంబురాలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని తోటపల్లిలో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) మంజూరు కావడంతో గ్రామస్తులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు మాట్లాడుతూ ఏటీసీ రావడంతో తోటపల్లి ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలు సంపత్, కాంగ్రెస్ నాయకులు రమేశ్, కుమార్ పాల్గొన్నారు.

◆ చేర్యాల ఐఎంఏ నూతన కమిటీ

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక అక్షయ ఆస్పత్రిలో డాక్టర్ కాశెట్టి మంజుల అధ్యక్షతన జరిగిన ఎన్నికలో ఐఎంఏ నూతన అధ్యక్షుడిగా డా.రామగళ్ళ పరమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా డా.ఏడెల్లి సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డా.తుంగ రఘునందన్‌రాజా, కోశాధికారిగా డా.కాశెట్టి మంజుల ఎన్నికయ్యారు. స్థానిక వైద్యులు శ్వేత, శ్రీవాత్సవ, సతీశ్, బాలకృష్ణ, సాయి తేజ పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు డైరీల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకట్రాజం శుక్రవారం విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సబీనా అక్తర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని చెప్పారు.